సాక్షి నిజామాబాద్

మంగళవారం ౹ 5 ౹ ఆగస్టు ౹ 2025



డీ-వార్మింగ్ డే..

నులిపురుగుల నివారణ మాత్రను 0-19 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరికీ అందించాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు.

- 8లో ▸



మెరుగైన వైద్య సేవలు..

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.7 /23.6

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ప్రజావాణికి 143 ఫిర్యాదులు



నిజామాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 143 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్ రావు, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డిలకు వివరించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

తెయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆరతి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీకి కొత్తగా మంజూరైన ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి నియమితులయ్యారు. వీసీ టీ యాదగిరి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఎం.యాదగిరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ప్రొఫెసర్ ఆరతి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇకపై ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఎప్‌సెట్ మూడో విడత కౌన్సెలింగ్ ద్వారా తెయూ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వనున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ భారతి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ బ్రాంచీల్లో మిగిలిన సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు కళాశాలలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.

బల్దియాలో స్పెషల్ రివ్యూ




నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న పనులపై కమిషనర్ దిలీప్‌కుమార్ సోమవారం ప్రత్యేక రివ్యూ నిర్వహించారు. బల్దియా కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఎం.రవిబాబుతో కలిసి అన్ని విభాగాల అధిపతులతో రెండు గంటల సమీక్షించారు. రెవెన్యూ, ఇంజినీరింగ్, శానిటేషన్, మెప్మా, బర్త్ అండ్ డెత్ విభాగాల పనులపై ఆరా తీశారు. విభాగాల వారీగా.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, దరఖాస్తుల స్వీకరణ, పన్ను వసూళ్లు, డబుల్ అసెస్‌మెంట్, వాటర్ చార్జీలు, మ్యుటేషన్, ఇంటినెంబర్ల కేటాయింపు, చెత్త సేకరణ తదితర వివరాలను తెలుసుకున్నారు. మెప్మా కార్యకలాపాల పై అసంతృప్తి వ్యక్తం చేశారు. రుణాల మంజూరు లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కొత్త సంఘాల ఏర్పాటులో అలసత్వంపై మండిపడ్డారు. నగరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు విఫలమవుతున్నారని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. జనన, మ రణాల ధ్రువీకరణ పత్రాల మంజూరు వేల సంఖ్యలో పెండింగ్ ఉందని మండిపడ్డారు. నెల రోజుల తర్వాత మళ్లీ రివ్యూ నిర్వహిస్తానని, అయినా పెండింగ్ పనులు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ ఈఈ మురళీ మోహన్‌రెడ్డి, డీఈలు సుదర్శన్‌రెడ్డి, ముస్తాక్ అహ్మద్, టీపీవో ప్రదీప్‌కుమార్, ఏఈలు, ఏసీపీలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

సన్న ధాన్యం ఏదీ బోనస్

- ఖరీఫ్ నాట్లు పూర్తికావొస్తున్నా చెల్లింపుల ఊసే లేదు
- ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిన జిల్లా
- జిల్లాలో 1,04,751 మంది రైతులకు రావాల్సిన బోనస్ రూ.369.38 కోట్లు

యాసంగి పంటపోయి వానాకాలం నాట్లు పూర్తవుతున్నా 'బోనస్' మాటలకే పరిమితమైంది. ఇదిగో వేస్తాం.. అదిగో వేస్తామంటూ సంబంధిత మంత్రి ప్రకటిస్తుండడంతో రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. సన్నాలు సాగు చేస్తే పంట దిగుబడి తక్కువగా వస్తుందని తెలిసీ.. బోనస్ ఆశతో వానాకాలంలో సైతం రైతులు సన్నాలను విస్తృతంగా సాగు చేస్తున్నారు.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన సన్నధాన్యం బోనస్ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. బోనస్ డబ్బుల చెల్లింపు విషయంలో ఆలస్యం అవుతుండడంతో రైతులు పరేషాన్ అవుతున్నారు. రూ.500 బోనస్ ఇస్తుండడంతో గత యాసంగిలో జిల్లాలో రైతులు భారీగా సన్నధాన్యం సాగు చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో రూ.1949.09 కోట్ల విలువైన ధాన్యం సేకరణ జరిగింది. కాగా ఇందులో సన్నధాన్యం 7,38,662 మెట్రిక్ టన్నులు ఉంది. ఇక 1,01,481 మెట్రిక్ టన్నులు దొడ్డు ధాన్యం సేకరించారు. ధాన్యం డబ్బులు మొత్తం రైతుల ఖాతాల్లో జమ చేశారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లింపు మాత్రం ఆలస్యం అవుతోంది. బోనస్ చెల్లింపుల విషయానికి వస్తే జిల్లాలో 1,04,751 మంది రైతులకు రూ.369.38 కోట్లు ఇవ్వాల్సి ఉంది. యాసంగి సీజన్ బోనస్ రాకపోవడంతో రైతులు నిట్టూరుస్తున్నారు. బోనస్ వస్తుందనే ఆశతో రైతులు దొడ్డు ధాన్యం బదులు అత్యధికంగా సన్నధాన్యం సాగు చేశారు. ఇదిలా ఉండగా జిల్లాలో సాధారణ వరి సాగు సుమారు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వేస్తున్నారు. ప్రస్తుతం ఇందులో దాదాపు 95 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. కాగా ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు బోనస్ చెల్లించే విషయంలో ఆలస్యం చేస్తుండడం పై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. త్వరలో బోనస్ చెల్లింపులు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుసార్లు చెప్పినప్పటికీ మాటలకే పరిమితమవుతూ ఆలస్యం చేస్తుండడం ఏమిటని రైతులు అంటున్నారు. తక్షణమే బోనస్ విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బోనస్ కోసమే సన్న రకాల సాగు



బోనస్ చెల్లిస్తారనే ఆశతోనే రైతులు యాసంగిలోను సన్న రకాలను సాగు చేశారు. బోనస్ చెల్లిస్తే వర్షాకాలం పెట్టుబడులకు రైతులు అప్పులు చేయాల్సిన అవసరం లేకపోయేది. సన్న రకాలకు బోనస్ చెల్లిస్తామని చెప్పి ప్రభుత్వం వంచన చేయడం తగదు. – దేగాం రాములు, రైతు, అంక్సాపూర్

ఆశతో సన్నాలు వేశాం



సన్నాలు సాగు చేస్తే క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో రైతులంతా సన్నాలే సాగు చేశారు. యాసంగి పంటకు ఇంత వరకు బోనస్ ఇవ్వలేదు. నేను 180 క్వింటాళ్ల వడ్లు ప్రభుత్వానికి అమ్మిన. రూ.90 వేల వరకు బోనస్ రావాల్సి ఉంది. ఆశతో ఖరీఫ్‌లో కూడా రైతులు సన్నరకాలు వేశారు. యాసంగి బోనస్ వెంటనే వేయాలి. – గంగాధర్, రైతు, డొంకేశ్వర్

ఎదురుచూస్తున్నాం



పోయిన రబీ సీజన్‌లో 100 క్వింటాళ్ల వడ్లు అమ్మిన. మొత్తం రూ.50 వేల దాకా ప్ర భుత్వం నుంచి బోనస్ రావాల్సి ఉంది. బోనస్ ఇస్తామని చెప్పి ఇంత వరకు ఇవ్వలేదు. బోనస్‌పై ఆశతోనే ఖరీఫ్‌లో కూడా సన్నాలే సాగు చేసినం. ఇచ్చిన మాట ప్రకారం రబీ బోనస్ ఇచ్చి ఖరీఫ్ పంటకు కూడా ఇవ్వాలి. – జిల్ల మహేశ్, తొండాకూర్

ప్రభుత్వంపై నమ్మకం పోయింది



బోనస్ విషయంలో ప్రభుత్వం మాట తప్పింది. ప్రభుత్వంపై నమ్మకం పోయింది. బోనస్ ఇవ్వరు అని తెలిసి ఉంటే రైతులు దొడ్డు రకాలను సాగు చేసేవారు. సన్న రకాల దిగుబడి తక్కువగా ఉండటంతో బోనస్‌తో కొంతైనా లాభం వస్తుందనే ఆశతో సన్న రకాలను సాగు చేశారు.
– కే చిన్న రాజేశ్వర్, రైతు, మోర్తాడ్

నష్టం భర్తీ అవుతుంది



బోనస్ వస్తుందన్న ఆశతో ఏసంగిన నాలుగున్నర ఎకరాల్లో సన్న వడ్లు సాగు చేశాను. 105 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దిగుబడి తక్కువగా వచ్చినా బోనస్ డబ్బులు వస్తాయన్న ఆశతో ఉన్నాను. వడ్లు విక్రయించి మూడు నెలలు అవుతోంది. బోనస్ డబ్బులు వస్తే నష్టం భర్తీ అవుతుందన్న ఆశతో ఉన్నాను.
– కే శంకర్, మేగ్యానాయక్ తండా, ఇందల్వాయి

ఆయకట్టుకు 'సాగర్' నీరు

- నేటినుంచి విడుదల
- ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



ఆయకట్టు రైతులతో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిజాంసాగర్ ఆయకట్టు కింద పంటలను కాపాడేందుకు ప్రాజెక్టునుంచి నీటి విడుదలకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. బాన్సువాడ ఎత్తిపోతల పథకం పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడడంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు పోచారం దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సోమవారం పైప్‌లైన్‌ను పరిశీలించారు. పైప్‌లైన్ వేసి చాలాకాలం కావడంతో అక్కడక్కడ లీకేజీలు ఏర్పడుతున్నాయని, కొత్తపైపులైన్ ఏర్పాటు, మోటార్ల కోసం ప్రతిపాదనలు పంపామని పోచారం తెలిపారు. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలు ఎండకుండా చూసేందుకు పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయిస్తామన్నారు. నిజాంసాగర్ నుంచి విడుదల చేసే నీటిని వృథా చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు మోహన్‌నాయక్, దాసరి శ్రీనివాస్, గులెపల్లి శంకర్, రైతులు రెంజర్ల సాయిలు, గొల్ల సాయిలు, నర్సగౌండ, అశోక్‌రెడ్డి, నగేష్, రాజు, సత్యపాల్‌రెడ్డి, రఘువీర్, ధనగారి రాజు, గులెపల్లి గంగాధర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌లో నుంచి బ్యాలెట్ బాక్సులను దించుతున్న సిబ్బంది



అహ్మదాబాద్ నుంచి..

- నాలుగు కంటైనర్లు.. 3,440 బ్యాలెట్ బాక్సులు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడనప్పటికీ.. మరోవైపు ప్రభుత్వ యంత్రాంగం మాత్రం పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నుంచి 4 కంటైనర్లలో 3,440 బ్యాలెట్ బాక్సులు (పెద్దవి) సోమవారం జిల్లా కేంద్రానికి చేరాయి. కలెక్టరేట్, జిల్లాపరిషత్‌లోని గదుల్లో బ్యాలెట్ బాక్సులను భద్రపర్చారు. జిల్లాలో ఇప్పటికే 2,530 పెద్ద, 1315 చిన్న బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉండగా, మరో 1200 బాక్సులు వస్తాయని జిల్లా పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే మండల కేంద్రాలు, పంచాయతీలకు బాక్సులను తరలిస్తామని పేర్కొన్నారు. – సుభాష్‌నగర్



కలెక్టరేట్‌లోని గదిలో బాక్సులను భద్రపరుస్తున్న సిబ్బంది

సొసైటీల ఆర్థిక స్థితిపై ఆరా!

- బకాయిలు, నిల్వల వివరాలు కోరిన ప్రభుత్వం
- పది రోజుల్లో ముగియనున్న పాలకవర్గాల పదవీకాలం



ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి సొసైటీ

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. అప్పుల బకాయిలు, నిల్వల వివరాలను సమర్పించాలని సీఈవోలను ఆదేశించింది. ఇందు కోసం మూడు రోజుల క్రితం ప్రత్యేక ఆన్‌లైన్ ఫార్మాట్‌ను ఇవ్వగా, అందులో సొసైటీల్లో నిల్వ ఉన్న నగదు, బకాయిలు, అప్పులు తీసుకున్న డైరెక్టర్ల వివరాలను ఎంట్రీ చేసి ప్రభుత్వానికి పంపుతున్నారు. అయితే ప్రభుత్వం ఈ వివరాలను ఎందుకు సేకరిస్తుందో సంబంధిత అధికారులకు కూడా తెలియడం లేదు. బకాయిలు చెల్లించని డైరెక్టర్ల పేర్లను అడగడంతో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటోదనన్న ఆసక్తి నెలకొంది.

పదవీకాలాన్ని పొడిగిస్తారా?

సొసైటీ పాలకవర్గాల పదవీకాలాన్ని ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 14 నుంచి ఆరు నెలలు పెంచింది. ఈనెల 14వ తేదీతో పదవీకాలం ముగియనుండగా పది రోజుల ముందుగానే సహకార సంఘాల ఆర్థిక పరిస్థితులపై ప్రభుత్వం ఆరా తీయడం సొసైటీల్లో చర్చనీయాంశమైంది. మరో ఆరు నెలలపాటు పాలకవర్గాల పదవీకాలం పొడగింపు ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహణకు ఆసక్తి చూపకపోవడం, కనీసం ఆ దిశగా చర్యలు కూడా చేపట్టకపోవడం చూస్తుంటే పదవీకాలం పెంపు తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో మొత్తం 89 సొసైటీలు ఉండగా ఇందులో 2.70లక్షల మంది వరకు రైతులు సభ్యులుగా ఉన్నారు. సొసైటీల పదవీకాలం నిబంధనల ప్రకారం ఐదేళ్లు మాత్రమే అయినప్పటికీ ఇప్పటికే పదవీకాలాన్ని ఒకసారి పొడిగించింది. జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌రావును వివరణ కోరగా... ప్రభుత్వం అడిగిన సొసైటీల ఆర్థిక వివరాలు సీఈవోలు పంపించారని, పాలకవర్గాల పదవీకాలం పొడగింపుపై తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

ప్రభుత్వ ఆఫీసుల్లో మూవ్‌మెంట్ రిజిస్టర్లు

- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి
- రెంజల్ మండలంలో పర్యటన.. తనిఖీలు
- విధులకు డుమ్మా కొట్టిన పీహెచ్‌సీ వైద్యుడు, అంగన్‌వాడీ టీచర్
- చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో, సీడీపీవోకు ఆదేశాలు



రెంజల్ పీహెచ్‌సీలో హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



వీరన్నగుట్ట అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి హైస్కూల్ హెచ్‌ఎంతో మాట్లాడుతున్న కలెక్టర్

రెంజల్(బోధన్): జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మూవ్‌మెంట్ రిజిస్టర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. గ్రామ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. మండల కేంద్రమైన రెంజల్‌తోపాటు వీరన్నగుట్టలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సోమవారం పర్యటించి హైస్కూల్, అంగన్‌వాడీ సెంటర్లు, పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వీరన్నగుట్టలో హైస్కూల్‌తోపాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్.. బోధన, బోధనేతర సిబ్బంది హాజరును ఫేషియల్ రికగ్నిషన్(ముఖ గుర్తింపు) విధానం ద్వారా నమోదు చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. టాయిలెట్స్, కిచెన్, తరగతి గదులను పరిశీలించి వాటిని శుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని స్కూల్ హెచ్‌ఎంను ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు అవసరమైన ప్రతిపాదనలను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పంపించాలని సూచించారు. అనంతరం రెంజల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పీహెచ్‌సీ డాక్టర్‌తోపాటు కొంత మంది సిబ్బంది లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్ హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి వారందరికీ అబ్సెంట్ వేశారు. డాక్టర్ ఉదయం నుంచి విధులకు హాజరుకాలేదని తెలుసుకున్న ఆయన వెంటనే డీఎంహెచ్‌వోతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన సమయంలో టీచర్ అందుబాటులో లేకపోవడంతో సీడీపీవోకు ఫోన్ చేశారు. టీచర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సొసైటీ గోడౌన్‌ను సందర్శించి ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు.

వద్దన్నవారికి మళ్లీ చోటు

- పదోన్నతి సీనియారిటీ జాబితాలో నాట్ విల్లింగ్ టీచర్లు
- 125 అభ్యంతరాల స్వీకరణ

నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయ పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితాలో కొన్ని లోపాలు చోటుచేసుకున్నాయి. గతంలో పదోన్నతిని తిరస్కరించిన 15 మంది ఎల్ ఎఫ్ హెచ్‌ఎంలు, సీనియర్ టీచర్లకు ప్రస్తుత జాబితాలో చోటు కల్పించారు. ఉత్తర్వు నంబర్ 145 ప్రకారం పదోన్నతి సమయంలో రెండుసార్లు నాట్ విల్లింగ్ ఇస్తే మళ్లీ సీనియారిటీ జాబితాలో చోటు కల్పించే వీలుండదు. కానీ 2009, 2013లో నాట్ విల్లింగ్ ఇచ్చిన జిల్లాలోని కొందరు ఉపాధ్యాయులు నిబంధనలను తుంగలోతొక్కి సీనియారిటీ జాబితాలో స్థానం దక్కించుకున్నారు. సర్వీస్ రికార్డుల్లో 'నాట్ విల్లింగ్' వివరాలు నమోదు చేయకపోడాన్ని సదరు ఉపాధ్యాయులు అవకాశంగా మల్చుకున్నారు. జిల్లా విద్యాశాఖ ఉద్యోగులను తప్పుదోవపట్టించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

123 అభ్యంతరాలు..

పదోన్నతులకు సంబంధించి రెండు రోజుల్లో 123 అభ్యంతరాల దరఖాస్తులు అందాయి. పదోన్నతుల ప్రక్రియలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ సంబంధించి అనేక ఫిర్యాదులు ఉన్నాయి. ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలు కూడా సీనియారిటీ జాబితా సక్రమంగా లేదంటూ ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదులన్నింటిని పరిష్కరించి తుది జాబితాను విడుదల చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. అభ్యంతరాల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఈ విషయమై డీఈవో అశోక్‌ను వివరణ కోరగా.. జాబితా నుంచి అనర్హులను తొలగించి అర్హులకు పదోన్నతులు కల్పిస్తామన్నారు.

క్రీడాపోటీలతో సత్సంబంధాలు

- కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయిచైతన్య
- అట్టహాసంగా ప్రారంభమైన విద్యుత్ హాకీ టోర్నీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీపీ



హాకీ టోర్నీలో తలపడుతున్న క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: క్రీడాపోటీలతో ఉద్యోగుల మధ్య సత్సంబంధాలు ఏర్పడుతాయని పోలీస్ కమిషనర్ పి సాయిచైతన్య అన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని క్రీడల ద్వారా అధిగమించొచ్చని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యుత్ శాఖ ఎస్ఈ రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ హాకీ టోర్నీని సీపీ సోమవారం ప్రారంభించారు. ముందుగా క్రీడాపతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూ వినియోగదారులకు మెరుగైన సేవలందించడంతోపాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎంతో కష్టపడే విద్యుత్ ఉద్యోగుల్లో ఈ తరహా టోర్నీల నిర్వహణతో కొత్త ఉత్సాహం వస్తుందన్నారు. ఉద్యోగులు, సిబ్బందిని క్రీడల్లో ప్రోత్సహిస్తున్న విద్యుత్‌సంస్థ సీఎండీ అభినందనీయులని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఆపరేషన్ కామారెడ్డి శ్రావణ్ కుమార్, ఎస్ఈ ఓఎంసీ పీవీ రావు, అడిషనల్ డీసీపీ కే రామచంద్రరావు, రాష్ట్ర స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, డీఈలు ఏ రమేశ్, విక్రమ్, టోర్నీ ఆర్గనైజర్, ఏడీఈ తోట రాజశేఖర్, ఏఏవో గంగారం నాయక్ తదితరులు పాల్గొన్నారు. మొదటిరోజు టోర్నీలో నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్ వరంగల్ జిల్లాల విద్యుత్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- రాష్ట్ర మైనార్టీ కమిషన్‌ చైర్మన్‌ తారిక్‌ అన్సారీ



నిజామాబాద్‌నాగారం: ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించి, ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపై నమ్మకాన్ని పెంపొందించాలని రాష్ట్ర మైనార్టీ కమిషన్‌ చైర్మన్‌ తారిక్‌ అన్సారీ పేర్కొన్నారు. నిజామాబాద్‌ ప్రభుత్వ జిల్లా జనరల్‌ ఆస్పత్రి, వైద్య కళాశాలలను ఆయన సోమవారం సందర్శించారు. సూపరింటెండెంట్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌తో కలిసి జీజీహెచ్‌లోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, అవసరం ఉన్న మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం మెడికల్‌ కాలేజీ పనితీరుపై ప్రిన్సిపల్‌ డాక్టర్‌ కృష్ణమోహన్‌తో కలిసి సమీక్షించారు. వైద్య విద్యార్థుల శిక్షణలో భాగంగా కమ్యూనిటీ ఆరోగ్య శిబిరాల నిర్వహణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో వివిధ విభాగాల హెచ్‌వోడీలు, డాక్టర్లు, వైద్య కళాశాల ప్రొఫెసర్లు, అసోసియేట్‌ ప్రొఫెసర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పోలీస్‌ ప్రజావాణికి 14 ఫిర్యాదులు

ఖలీల్‌వాడి: జిల్లా పోలీస్‌ కమిషనరేట్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 14 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారుల సమస్యలను విన్న సీపీ సాయిచైతన్య వాటిని చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్‌ శాఖ పని చేస్తుందని తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత

రుద్రూర్‌: మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని సోమవారం ఉదయం పట్టుకున్నట్టు ఎస్సై సునీల్‌ తెలిపారు. పోతంగల్‌ శివారులోని రెండో బ్రిడ్జి వద్ద ఇసుక తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

డీ-వార్మింగ్‌ డేపై ప్రచారం చేయాలి

- 19 ఏళ్లలోపు పిల్లలకు అల్బెండజోల్‌ మాత్ర అందించాలి
- కలెక్టర్‌ టీ వినయ్‌ కృష్ణారెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి, వైద్యారోగ్యశాఖ అధికారులు

నిజామాబాద్‌ అర్బన్‌: నులిపురుగుల నివారణ మాత్రను 0–19 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరికీ అందించాలని కలెక్టర్‌ టీ వినయ్‌ కృష్ణారెడ్డి సూచించారు. డీ–వార్మింగ్‌ డేపై జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌ మినీ సమావేశ మందిరంలో డీ–వార్మింగ్‌ డే కార్యక్రమంపై టాస్క్‌ఫోర్స్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలలు, కళాశాలలోని విద్యార్థులకు, మదర్సాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలందరికీ నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్‌ మాత్రను అందించాలని తెలిపారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో ఒక నోడల్‌ అధికారిని నియమించాలని సూచించారు. భోజనం తిన్న తర్వాత ఈ మాత్రను పిల్లలకు వేయాలని తెలిపారు. పిల్లలలో రక్తహీనత, బరువు తగ్గుదల తదితర వ్యాధుల నుంచి కాపాడేందుకు అల్బెండజోల్‌ మాత్ర దోహదపడుతుందని అన్నారు. ఈ మాత్ర వేసుకోవడం ద్వారా ఎనీమియా, ఇతర ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. ఆహార పదార్థాలు తినే ముందు పిల్లలు చక్కగా చేతులు శుభ్రం చేసుకునేలా పాఠశాలల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. విద్యా, వైద్యారోగ్య, మహిళా శిశు సంక్షేమశాఖలతోపాటు మెప్మా, ఐకేపీ, మున్సిపల్‌ సిబ్బంది, ఐఎంఏ ప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ నెల 11న అన్ని చోట్ల అల్బెండజోల్‌ మాత్రలు ప్రతి విద్యార్థికి వేశారా లేదా అన్నది పక్కాగా నిర్ధారిస్తూ, ఒకవేళ ఎవరైనా తప్పిపోతే అలాంటి వారిని సైతం గుర్తించి మలివిడతగా ఈ నెల 18న నులి పురుగు నివారణ మాత్ర వేయించాలని అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలపై దృష్టి సారించాలని కలెక్టర్‌ సూచించారు.

11న నులి పురుగుల నివారణ దినోత్సవం

ఈ నెల 11న నులిపురుగుల నివారణ దినోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని డీఎంహెచ్‌వో రాజశ్రీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 19ఏళ్ల లోపు వయసు కలిగిన 4,05,443 మందికి మాత్రలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. మాత్ర వేసుకున్న తర్వాత ఎవరికైనా వాంతులు అయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అత్యవసరమైతే సమీప ఆస్పత్రి, పీహెచ్‌సీకి తీసుకెళ్లాలని సూచించారు. ఇప్పటికే అన్ని ప్రాంతాలలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని, నోడల్‌ అధికారులను గుర్తించామని అన్నారు. అనంతరం డీ–వార్మింగ్‌ డేపై అవగాహన కల్పించే గోడ ప్రతులను కలెక్టర్‌ ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌ అంకిత్‌, డీపీవో శ్రీనివాస్‌ రావు, ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ అశోక్‌, డీడబ్ల్యూవో రసూల్‌ బీ పాల్గొన్నారు.

వాహనం ఆర్సీ మార్పిడి ఇలా...

సమాచారం



కమ్మర్‌పల్లి/ఖలీల్‌వాడి: ఎవరి దగ్గర నుంచైనా పాత వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు ఆర్సీ (రిజిస్ట్రేషన్‌ సర్టిఫికెట్‌)ని మధ్యవర్తుల సాయం లేకుండానే మన పేరు మీదకి సులభంగా మార్చుకోవచ్చు. అందుకోసం కింద తెలిపిన పత్రాలు సమకూర్చుకోవాలి.

- ఫారం 29, వాహనం అమ్మిన వారు ఇచ్చే సమాచారం
- ఫారం 30, కొనుగోలుదారుడు దరఖాస్తు కోసం
- ఒరిజినల్‌ రిజిస్ట్రేషన్‌ సర్టిఫికెట్‌, ఇన్సూరెన్స్‌ సర్టిఫికెట్‌
- పొల్యూషన్‌(పీయూసీ) ధ్రువీకరణ
- పాన్‌ కార్డు
- చాసిస్‌ నంబర్‌, ఇంజిన్‌ నంబర్‌, పెన్సిల్‌ ఇంప్రింట్‌
- చిరునామా ధ్రువీకరణ పత్రం (ఆధార్‌, ఓటరు కార్డు, ఏదైనా గుర్తింపు కార్డు)
- క్రయ, విక్రయదారుల పాస్‌పోర్ట్‌ సైజ్‌ ఫొటోలు
- రోడ్డు పన్ను చెల్లించిన రశీదు
- ఫారం 28 ఎన్‌వోసీ (వాహనం ఇతర రాష్ట్రాలకు చెందినది అయితే)
- ఫైనాన్స్‌ ఉన్న వాహనాలకు సదరు సంస్థ నుంచి ఎన్‌వోసీ ఫారం 35 అవసరం అవుతుంది.

వాహన యజమాని మరణిస్తే ఫారం 31 మరణ ధ్రువీకరణ పత్రం, వారసత్వ ధ్రువీకరణ పత్రం, వారసుల అఫిడవిట్‌ ఉండాలి. పై పత్రాలు సిద్ధంగా ఉంచుకొని ఆన్‌లైన్‌లో transport.telangana.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి నమోదు చేసుకోవాలి. వాహన నంబర్‌, చాసిస్‌ నంబర్‌, చివరి 5 అంకెలు, మొబైల్‌ నంబర్‌ నమోదు చేసుకోవాలి. ఓటీపీ ద్వారా ధ్రువీకరించాలి. అన్ని పత్రాలు అప్‌లోడ్‌ చేయాలి. సంబంధిత ఫీజు చెల్లించాలి. అనంతరం అప్లికేషన్‌ డౌన్‌లోడ్‌ చేసుకొని ప్రింట్‌ తీసుకోవాలి. ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్‌ చేసుకొని ప్రింట్‌ తీసుకున్న దరఖాస్తుతోపాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌ చేసిన పత్రాలను అందించాలి. అక్కడ ఆర్టీఏ అధికారులు పత్రాలను పరిశీలించి మీ ఫొటో తీస్తారు. నంబర్‌ నిర్ధారించి, ధ్రువీకరణ అనంతరం కొత్త ఆర్సీ జారీ చేస్తారు. పూర్తి వివరాలకు రవాణా శాఖ హెల్ప్‌ లైన్‌ నంబర్‌ 040–23370081 ఫోన్‌ చేసి తెలుసుకోవచ్చు.

రంగుమారుతున్న ఎస్సారెస్పీ నీరు

- ప్రతియేటా ఇదే పరిస్థితి
- పరీక్షలు జరిపి, కలుషితం కాలేదంటున్న అధికారులు



రంగు మారిన ప్రాజెక్ట్‌ నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లో నిల్వ ఉన్న నీరు ఒక్కసారిగా రంగు మారింది. గతేడాది ఇదే సమయంలో ప్రాజెక్ట్‌ నీరు ఆకుపచ్చ రంగులా మారింది. కాలువల ద్వారా నీటి విడుదల చేపడితే పంటలకు తెగుళ్లు వ్యాపించాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆ నీటిని ప్రస్తుతం ఆయకట్టుకు సరఫరా చేస్తే పంటల పరిస్థితి ఏంటని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. మత్స్యకారులు సైతం చేపలు మృత్యువాత పడే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. నీరు సైతం దుర్వాసన రావడంతో పర్యాటకులు ముక్కున వేలేసుకుంటున్నారు.

ఎందుకు రంగు మారుతుంది?

ప్రతి సంవత్సరం శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరదలు వచ్చిన వారం రోజుల తరువాత నీటి రంగు మారుతుంది. ముఖ్యంగా మహారాష్ట్ర నుంచి వరదలు వచ్చినప్పుడే ప్రాజెక్ట్‌నీరు రంగు మారుతుంది. ప్రాజెక్ట్‌ ఎగువన మహారాష్ట్రలోని ధర్మాబాద్‌ వద్ద పలు ఫ్యాక్టరీల నుంచి వ్యర్థాలను గోదావరిలోకి అధికంగా వదలడంతో ప్రాజెక్ట్‌లోకి కొట్టుకు వచ్చి రంగు మారుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. కానీ అధికారులు, పాలకులు మాత్రం ఈ సమస్యపై దృష్టి సారించడం లేదు. శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి మిషన్‌ భగీరథ ద్వారా ప్రతి రోజు 231 క్యూసెక్కుల నీటిని తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. గత రెండేళ్ల క్రితం పరీక్ష కోసం నీటి నమూనాలను సేకరించారు. కానీ, నీరు కలుషితం కావడం లేదని నివేదిక ఇచ్చారు. నీరు కలుషితం కానప్పుడు వ్యర్థంతో నీరు రంగు ఎందుకు మారుతుందనే ప్రశ్నకు ఎవరి వద్దా సమాధానం ఉండదు. ప్రాజెక్ట్‌ నీరు రంగు మారడంపై పూర్తిస్థాయిలో విచారణ చేపడితే తప్ప నిజాలు బయటకు వచ్చేలా లేవని ఆయకట్టు రైతులు అంటున్నారు.

ఫిర్యాదు రాలేదు..

మిషన్‌ భగీరథ వారి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదు. నీరు మాత్రం రంగు మారింది. మిషన్‌ భగీరథ అధికారులు నిత్యం నీటిని పరీక్షలకు పంపుతున్నారు. అవసరమైతే మళ్లీ శాంపిళ్లను పరీక్షల కోసం పంపుతాం. – చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

కాంగ్రెస్‌ పాదయాత్రలో బందోబస్తు ఎందుకు?

- జనాలు తిరగబడతారనే భారీ భద్రత
- నిజామాబాద్‌ రూరల్‌ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ విమర్శ



బాజిరెడ్డి గోవర్ధన్‌

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): జిల్లాలో కాంగ్రెస్‌ పార్టీ నిర్వహించిన జనహిత పాదయాత్రకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంపై నిజామాబాద్‌ రూరల్‌ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని కారణంగా ప్రజలు ఎక్కడ తమపైకి తిరగబడతారోననే భయంతో వందలాది మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేసుకోవడం సిగ్గు చేటన్నారు. సోమవారం ఆయన 'సాక్షి' తో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ జిల్లాలో రెండు రోజుల కార్యక్రమంలో ప్రజలతో మమేకం అయ్యిందేమీ లేదని కేవలం జనాల్లో హడావుడి సృష్టించేందుకు చేసిన డ్రామా అని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్‌పై పీసీసీ ప్రెసిడెంట్‌ మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ మాట్లాడిన మాటలను విని జనాలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీకి డిపాజిట్‌ రాదని జోస్యం చెప్పారు. ప్రజలంతా డిసైడ్‌ అయ్యారని, బీఆర్‌ఎస్‌ పార్టీ ఘన విజయం సాధించబోతున్నదని బాజిరెడ్డి గోవర్ధన్‌ ధీమా వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలతో సహా ఎన్నికల సమయంలో ఇచ్చిన మొత్తం 420 హామీలలో ఎన్ని అమలు చేశారో చెప్పాలని ఆయన నిలదీశారు. జిల్లాలో 2లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదన్న విషయం పాదయాత్ర సందర్భంగా మీ దృష్టికి రాలేదా? అని ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇస్తామని ముఖం చాటేయలేదా అని విమర్శించారు. కేసీఆర్‌ రైతు బంధు ఇచ్చి అన్నదాతలకు అండగా నిలిస్తే, సీఎం రేవంత్‌ రెడ్డి రైతులకు భరోసా లేకుండా చేసి వారికి వెన్నుపోటు పొడవలేదా? అని బాజిరెడ్డి గోవర్ధన్‌ ప్రశ్నించారు. ఆసరా పెన్షన్లు పెంచి రూ.4వేల చొప్పున ఇస్తామన్న హామీ ఏమైందని, ఒక్కరికైనా నిరుద్యోగ భృతి ఇచ్చారా అని పేర్కొన్నారు. మహిళలకు రూ.2,500, విద్యార్థినులకు స్కూటీలు ఎప్పుడిస్తారని నిలదీశారు. ఇచ్చిన హామీలపై మీనాక్షి నటరాజన్‌తో సహా కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నోరు విప్పకపోవడం శోచనీయమన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ పార్టీ భేషరతుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని బాజిరెడ్డి గోవర్ధన్‌ డిమాండ్‌ చేశారు.

పారా అథ్లెట్లకు ఆలస్యంగా రాష్ట్రస్థాయి పోటీల సమాచారం

నిజామాబాద్‌నాగారం: దివ్యాంగ క్రీడాకారుల ప్రతిభా ప్రదర్శనకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని జిల్లా సంక్షేమాధికారి సమాచారం అందించడంలో ఆలస్యం చేశారు. ఈ నెల 5న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో రాష్ట్ర సబ్‌ జూనియర్‌, జూనియర్‌ పారా అథ్లెటిక్‌ చాంపియన్‌ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు 2వ తేదీన ప్రకటన విడుదల చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. కానీ, జిల్లాలోని పారా అథ్లెట్లకు సమాచారం ఇవ్వడంలో అధికారులు తాత్సారం చేశారు. క్రీడాకారులు కార్యాలయంలో సంప్రదించాలని జిల్లా సంక్షేమాధికారి రసూల్‌బీ సోమవారం ప్రకటన విడుదల చేశారు. దీంతో మంగళవారం నిర్వహించే టోర్నీలో జిల్లాకు చెందిన పారా అథ్లెట్లు ఎలా పాల్గొంటారని సీనియర్‌ క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి 8 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్‌ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 462 క్యూసెక్కుల నీరు పోతుంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1078.20(40.25 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

క్యాంపస్‌లో తీజ్‌ ఉత్సవాలు ప్రారంభం



తీజ్‌ ఉత్సవాల్లో పాల్గొన్న బంజారా విద్యార్థినులు, అధ్యాపకులు, సిబ్బంది

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో సోమవారం సాయంత్రం తీజ్‌ ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బంజారాల ఆరాధ్యదైవం సంత్‌ సేవాలాల్‌ మహరాజ్‌ చిత్రపటానికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజీ ప్రిన్సిపల్‌ మామిడాల ప్రవీణ్‌ కుమార్‌ మాట్లాడుతూ.. బంజారా విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బంది తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం హర్షనీయమన్నారు. తొమ్మిది రోజులపాటు తీజ్‌ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెయూ గిరిజన శక్తి విద్యార్థి సంఘం అధ్యక్షుడు శ్రీను రాథోడ్‌ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ శాంతాబాయి, అకడమిక్‌ కన్సల్టెంట్‌ కిరణ్‌రాథోడ్‌, సిబ్బంది ప్రవీణ్‌ కుమార్‌, బికోజీ, నరేశ్‌, మహవీర్‌, రవీందర్‌ నాయక్‌, ఎస్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు సాగర్‌ నాయక్‌, ఏబీవీపీ అధ్యక్షుడు పృథ్వీ, విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

కారు, ఆటో ఢీ.. ఇద్దరికి గాయాలు

వేల్పూర్‌: మండలంలోని లక్కోర వద్ద 63 నెంబర్‌ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై సంజీవ్‌ మంగళవారం తెలిపారు. అంక్సాపూర్‌ నుంచి ఆర్మూర్‌కు ఆటోను ఆర్మూర్‌ నుంచి మోర్తాడ్‌ వైపు కారులో వెళ్తున్న జలందర్‌ అనే వ్యక్తి అతివేగంగా ఢీకొట్టాడు. దీంతో ఆటోలో ఉన్న లింబాద్రి, ముత్తెన్నలకు బలమైన గాయాలైనట్లు పేర్కొన్నారు. లింబాద్రి కొడుకు నరేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పొలంలో పడి ఒకరి మృతి



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం గోవింద్‌పేట్‌ గ్రామంలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు పొలంలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సంతోష్‌ రామ్‌(35) తన భార్యతో కలిసి గోవింద్‌పేట్‌లో నివాసముంటూ వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పొలం పని చేస్తుండగా మూర్ఛ రావడంతో బోర్లాపడి మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..

బోధన్‌: ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామ శివారులో పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన సిరిగంధపు శ్రీనివాస్‌(36) నీటమునిగి మృతి చెందాడు. ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపిన ప్రకారం.. పోచారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌ ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో చేపలు పట్టేందుకు వెళ్తున్నానని తండ్రికి చెప్పాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో సోమవారం చెరువులో ఆచూకీ కోసం వెతికారు. మధ్యాహ్న సమయంలో శ్రీనివాస్‌ మృతదేహం చెరువులో నీటిపై తేలింది. చేపల వల కాళ్లకు చుట్టుకొని, ఈత రాక నీటమునిగి మృతి చెందాడన్నారు. మృతుడి తండ్రి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..



ఆర్మూర్‌టౌన్‌: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్‌(41) గత శుక్రవారం ఆలూరు మండలం మచ్చర్ల శివారులో బైక్‌పై వెళ్తుండగా అడవి పంది ఢీకొని కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రవీణ్‌ను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి సోమవారం చికిత్స పొందుతూ ప్రవీణ్‌ మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదు

నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్‌ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని లైంగిక వేధింపులకు పాల్పడుతున్న గణేశ్‌ అనే లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదైంది. విద్యార్థిని పట్ల లెక్చరర్‌ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలియడంతో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌ సదరు కళాశాలలో నిరసన తెలిపి నిర్వాహకులను నిలదీశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మహిళా ఎస్సై విచారణ చేపట్టగా లెక్చరర్‌ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తేలింది. పోలీసులు లెక్చరర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న టీజీవీపీ నాయకుడు కల్యాణ్‌ కళాశాల ఎదుట ధర్నా చేశారు.

తెయూ సౌత్‌ క్యాంపస్‌లో విద్యార్థుల ధర్నా

- సమస్యల పరిష్కారానికి డిమాండ్‌
- ఆరు గంటలపాటు కొనసాగిన నిరసన
- రిజిస్ట్రార్‌ హామీతో ఆందోళన విరమణ



అశ్విని మృతదేహానికి నివాళులర్పిస్తున్న వార్డెన్‌ సునీత



ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్‌ యాదగిరి

భిక్కనూరు: అందుబాటులో అంబులెన్స్‌, వైద్య సిబ్బంది ఉంటే పీజీ విద్యార్థిని అశ్విని మరణించి ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేస్తూ తెలంగాణ వర్సిటీ సౌత్‌ క్యాంపస్‌లో విద్యార్థులు ధర్నా చేపట్టారు. సోమవారం ఉదయం 9 గంటలకు ప్రిన్సిపల్‌ కార్యాలయం ఎదుట ప్రారంభమైన ఆందోళన ఆరు గంటలపాటు కొనసాగింది. ప్రిన్సిపల్‌ సుధాకర్‌ గౌడ్‌తోపాటు పలువురు అధ్యాపకులు సముదాయించినా విద్యార్థులు శాంతించలేదు. వీసీ వచ్చే వరకు ధర్నా విరమించేది లేదని మొండికేశారు. దీంతో ప్రిన్సిపాల్‌ ఈ విషయాన్ని రిజిస్ట్రార్‌ యాదగిరి, వీసీ యాదగిరిరావుల దృష్టికి తీసుకెళ్లారు. వీసీ అందుబాటులో లేకపోవడంతో రిజిస్ట్రార్‌ యాదగిరి సౌత్‌క్యాంపస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా సౌత్‌ క్యాంపస్‌లో హెల్త్‌కేర్‌ సెంటర్‌ లేకపోవడంతో కలుగుతున్న ఇబ్బందులను విద్యార్థులు రిజిస్ట్రార్‌కు వివరించారు. క్యాంపస్‌లో సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌ యాదగిరి మాట్లాడుతూ వర్సిటీ లేదా సీఎస్‌ఆర్‌ నిధుల నుంచి అంబులెన్స్‌ను కొనుగోలు చేసి క్యాంపస్‌కు పంపిస్తామన్నారు. వైద్యుడు లేదా వైద్య సిబ్బంది 24 గంటలపాటు ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. విద్యార్థుల ధర్నా నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అశ్వినికి ఘన నివాళి

సౌత్‌ క్యాంపస్‌లో ఆత్మహత్య చేసుకున్న అశ్వినికి సోమవారం పలువురు ఘన నివాళులర్పించారు. మృతదేహంపై పూలమాలలు వేసి కన్నీటి పర్యంతమయ్యారు. వార్డెన్‌ సునీత, అధ్యాపకులు ప్రతిజ్ఞ, సరితలు అశ్విని మృతదేహం వద్ద నివాళులర్పించారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు జైలు

- 13 ఏళ్ల శిక్ష విధిస్తూ జిల్లా జడ్జి తీర్పు

నిజామాబాద్‌ లీగల్‌: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, సెషన్స్‌ జడ్జి జీవీఎస్‌ భరతలక్ష్మి పదమూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోపాల్‌ మండలం మంచిప్ప గ్రామానికి చెందిన జల్లాపురం సాయికుమార్‌కు గాంధారి మండలం చద్మల్‌కు చెందిన మౌనికతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహమైన తర్వాత దంపతులిద్దరూ బాగానే ఉన్నా, మరో మహిళతో వివాహేతర సంబంధం వీరి కుటుంబంలో కలహాలు పుట్టించింది. ఇరువర్గాల పెద్దలు పలుసార్లు పంచాయితీ నిర్వహించి దంపతుల మధ్య రాజీ కుదిర్చారు. ఆ తర్వాత కొన్నాళ్లకు మౌనిక తల్లికి కల్యాణలక్ష్మి డబ్బుల మంజూరుకావడంతో ఆ డబ్బుల్లో తనకూ వాటా కావాలని సాయికుమార్‌ అడిగాడు. దీంతో ఇరువురి మధ్య మరోసారి గొడవ చోటుచేసుకుంది. దీంతో 28 ఆగస్టు 2023న మౌనిక తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మోపాల్‌ పోలీసులు మౌనిక భర్త సాయికుమార్‌, అత్త నవనీతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా సెషన్స్‌ కోర్టు న్యాయమూర్తి జీవీఎస్‌ భరతలక్ష్మి, భార్య ఆత్మహత్యకు కారణమైన సాయికుమార్‌కు 10 సంవత్సరాల జైలు విధించగా, భార్యను వేధించినందుకు మరో 3 సంవత్సరాల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చింది. కాగా, ఈ కేసులో మౌనిక అత్త నవనీతను కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. జిల్లా కోర్టు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా రాజేశ్వర్‌ వ్యవహరించారు.

మట్కా నిర్వాహకులకు రెండు రోజులు..

బోధన్‌ టౌన్‌(బోధన్‌): మట్కా నిర్వహిస్తున్న ఇద్దరికి బోధన్‌ కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్‌ పట్టణంలోని గోశాల ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్న ముజాహిద్‌ అలియాస్‌ ముజ్జు, మహ్మద్‌ సద్దాం హుస్సేన్‌లపై కేసు నమోదు చేసి సోమవారం బోధన్‌ కోర్టులోని సెకండ్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ శేష తల్ప సాయి ఎదుట హాజరుపర్చామన్నారు. ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తు తీర్పు వెలువరించారన్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్‌ ప్రాంతంలో మద్యం సేవించి వాహనం నడుపుతున్న దూప్‌సింగ్‌ అనే వ్యక్తికి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

కులం పేరుతో దూషించిన ఇద్దరికి మూడేళ్లు..

నిజామాబాద్‌ లీగల్‌: దళితులను కులం పేరుతో దూషించి, వారిపై దాడి చేసిన ఇద్దరికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఎస్సీ,ఎస్టీ కోర్టు న్యాయమూర్తి టీ శ్రీనివాస్‌ రావు సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నవీపేట్‌ మండలం సలీంఫారం గ్రామానికి చెందిన మెగులపు సాయికృష్ణ, ఆయన కుమారుడు మెగులపు రవిచంద్ర, అదే గ్రామానికి చెందిన మదిర శారద ఇంటిపక్కన రోడ్డుపై ఉన్న బండరాయిని పొక్లెయిన్‌తో తొలగించారు. బండరాయిని తొలగించిన ప్రదేశంలో గుంత ఏర్పడటంతో ఆ గుంతను పూడ్చాలని శారద భర్త చిన్నయ్య, సాయికృష్ణ కుటుంబసభ్యులను కోరారు. గుంతను పూడ్చేందుకు వారు నిరాకరించడంతో చిన్నయ్య కుటుంబసభ్యులు దానిపై ముళ్లకంప ఉంచారు. కంప రోడ్డుకు అడ్డంగా ఉందని, దానిని తొలగించాలని సాయికృష్ణ కుటుంబసభ్యులు వారితో గొడవపడ్డారు. ఈ సందర్భంగా శారదతోపాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులను సాయికృష్ణ, అతని కుమారుడు రవిచంద్ర కులంపేరుతో దూషించి, దాడికి దిగారు. బాధితులు నవీపేట్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేసిన పోలీసులు, విచారణ నిమిత్తం నిజామాబాద్‌ ఎస్సీ, ఎస్టీ కోర్టుకు అప్పగించారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి టీ శ్రీనివాస్‌ రావు, నిందితులు సాయికృష్ణ, అతని కుమారుడు రవిచంద్రలకు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.3,500 జరిమానా విధించారు. ఈ కేసులో పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా బంటు వసంత్‌ వ్యవహరించారు.